క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



సుబ్రమణ్యంరెడ్డి, తహసీల్దార్

సంబేపల్లె : మండల తహసీల్దార్‌గా సుబ్రమణ్యంరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు అన్నమయ్య జిల్లా కేంద్రానికి బదిలీ కావడంతో సంబేపల్లెకు సుబ్రమణ్యం రెడ్డి తహసీల్దార్‌గా వచ్చారు. ప్రజలకు అందు బాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అభినందనలు తెలియజేశారు.

అవకతవకలు నిర్ధారణ అయితే కఠిన చర్యలు

ఒంటిమిట్ట : గత మూడు రోజులుగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 15వ ఆర్థిక నిధులతో అవకతవకలు జరిగాయంటూ కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాలకు తాను ఇక్కడికి వచ్చానని, అవి నిరూపణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని డీఎల్‌డీఓ సుబ్రమణ్యం తెలిపారు. ఆరోపణలలో నిజనిజాలు వెలుగు తీసేందుకు శుక్రవారం డీఎల్‌డీఓ సుబ్రమణ్యం ఒంటిమిట్ట మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ ద్వారా మంజూరైన పనులను తెలుసుకొని వాటిని ఎం.బుక్‌లలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి

సంబేపల్లె : విద్యార్థులు చిన్నతనం నుంచి నైతిక విలువలు పెంపొందించుకోవాలని మానవత స్వచ్ఛంద సంస్థ రాయచోటి శాఖ చైర్మన్ గంగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మానవతా విలువలపై అవగాహన కల్పించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివినప్పుడే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను చేరతారన్నారు. అనంతరం విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్ లబ్ధిదారుల విచారణ



దివ్యాంగుల పింఛన్‌లు తనిఖీ చేస్తున్న వైద్యులు

పుల్లంపేట : మండలంలో శుక్రవారం కడప రిమ్స్ నుంచి వైద్యులు దివ్యాంగ పింఛన్‌లు పొందుతున్న వారిని తనిఖీ చేశారు. పింఛన్లు పొందుతున్న దివ్యాంగుల పింఛన్‌లను ఏఓ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించారు. అర్హులైన వారి నివేదికలు ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, డిజిటల్ అసిస్టెంట్ నారాయణ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ అనీల్, జీఎంఎస్ కె.నాగమణి, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను శుక్రవారం సర్పంచ్ జైపాల్ రెడ్డి జేసీబీ సహాయంతో తొలగించే పనులను చేయించారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా ఉంటూ వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉండటంతో పరిస్థితిని గమనించిన సర్పంచ్ చర్యలు తీసుకున్నారు. ఈ విషయమై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మినీ గోకులాలను నెలలోగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి

ఒంటిమిట్ట : నెలలోగా మండలానికి మంజూరైన 35 మినీ గోకులాలను పూర్తి చేయాలని ఏపీడీ సోమశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంజీఎన్ఆర్ఈజీఏ కార్యాలయాన్ని వారు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉపాధి పనులు జరిగే ప్రదేశాలకు వెళ్లి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ కూలీల సంఖ్యను పెంచాలని, చేసే పనులకు సంబంధించిన కొలతలను కచ్చితంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు చంద్రశేఖర్ రెడ్డి, పవన్‌లు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మహిళ మృతి

రాజంపేట : పట్టణంలోని విద్యాసాగర్ నగర్‌లో విషాదం చోటుచేసుకుంది. తన ఇంటి నుంచి బెంగళూరుకు వెళ్తున్న చెల్లెలు కొడుకుకు బట్టల కొనేందుకు షాపింగ్ వెళ్లిన నడిగడ్డ షాజహాజన్ ఊరఫ్ షాజీ (48) పట్టణానికి ఈ సందర్భంలో డ్రస్‌కు ఉన్న చున్నీ బండి చక్రంలో ఇరుక్కుని మహిళ మెడకు చుట్టుకుంది. దీంతో ఆమె ఒక్కసారిగా రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయం తగిలి సంఘటనా స్థలంలోనే మృతిచెందింది. ప్రమాద స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

సిబ్బంది లేక.. సేవలందక!

- చింతరాజుపల్లి సచివాలయంలో సిబ్బంది కొరత
- మారుమూల గ్రామంలో పోస్టింగ్‌పై ఉద్యోగుల అనాసక్తి
- అవస్థలు పడుతున్న గ్రామ ప్రజానీకం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



చింతరాజుపల్లి సచివాలయంలో సిబ్బంది లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

ఒంటిమిట్ట : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల వద్దకే పరిపాలన, గ్రామ స్వరాజ్యం తీసుకురావాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక జీఓతో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పలు రకాల సర్టిఫికెట్లు వంటి 540 రకాల సేవలను నేరుగా ప్రజల వద్దకే అందేలా చేశారు. కానీ కొంతమంది సచివాలయ సిబ్బంది వారికి ఉన్న పరిచయాలు, రాజకీయ పలుకుబడులతో పల్లెల్లో విధులు నిర్వహించడం ఇష్టంలేక పట్టణాలకు డిప్యుటేషన్ వేయించుకున్నారు. దీంతో గ్రామాల్లో సచివాలయ సిబ్బందిలేక ప్రజలు సేవలు అందుకోలేక తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమస్య ఒంటిమిట్ట మండల పరిధిలోని చింతరాజుపల్లి గ్రామ సచివాలయంలో కనిపిస్తోంది.

డిప్యుటేషన్ కారణంగా సేవల్లో జాప్యం

సచివాలయాలు ఏర్పాటు అయిన నాటి నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నంత వరకు చింతరాజుపల్లె సచివాలయంలో ప్రజలకు నిర్విరామంగా సేవలందాయి. అనంతరం సచివాలయ సిబ్బంది వారివారి వ్యక్తిగత కారణాలు, రాజకీయ నాయకుల సిఫారసులతో బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. దీంతో మారుమూల ప్రాంతమైన చింతరాజుపల్లె సచివాలయంలో పోస్టింగ్‌కు ఎవరు ఆసక్తి చూపలేదు. కాగా ఇక్కడ పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ రెండేళ్ల క్రితం బదిలీపై వెళ్లగా ఇప్పటికీ ఈ స్థానంలో మరో అధికారిని నియమించకపోవడం మండల అధికారుల నిర్లక్ష్యమేనని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ గ్రామంలో పాడి రైతులు అధికంగా నివసిస్తున్నారు. పశువులకు వైద్య సేవలు అందకపోవడంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

పది మందికి గాను ముగ్గురే విధులు

ముఖ్యంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పంచాయతీ సెక్రటరీ, వీఆర్ఓ, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్, ఏఎన్ఎం, మహిళా పోలీస్, విలేజ్ సర్వేయర్ ఉండాలి. కానీ చింతరాజుపల్లి గ్రామ సచివాలయంలో మాత్రం ప్రస్తుతం పంచాయతీ సెక్రటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఉన్న వీఆర్ఓను మండల పరిధిలోని కొత్తమాధవరానికి ఇన్‌చార్జ్‌గా వేయడంతో చింతరాజుపల్లి సచివాలయానికి రావడమే కరువైంది. ఉన్న పదిమందిలో పైన తెలిపిన ముగ్గురు మాత్రమే సచివాలయంలో విధులు నిర్వహిస్తుంటే ఇక్కడ ఉన్న విలేజ్ సర్వేయర్ నియమితులైన నెలకే డిప్యుటేషన్‌పై వెళ్లారు. అలాగే విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ చింతరాజుపల్లి సచివాలయంలో మూడు సంవత్సరాలు విధులు నిర్వహించి డిప్యుటేషన్‌పై వెళ్లిపోయారు. ఇక్కడ పనిచేసిన డిజిటల్ అసిస్టెంట్‌ను మండలంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఎంపీడీఓ ప్రసాద్ నియమించుకున్నారు. ఇలా ఎవరికి వారు తమ వ్యక్తిగత కారణాలు, రాజకీయ ప్రోద్బలంతో బదిలీలు కోరడంతో చింతరాజుపల్లె సచివాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది.

ఖాళీల భర్తీకి చర్యలు శూన్యం

గతంలో ఏ సర్టిఫికేట్ పొందాలన్నా మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్లాల్సిందే. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో ప్రక్షాళన చేశాక గ్రామ పంచాయతీ కేంద్రంలోనే ప్రజలకు వలంటీర్ల ద్వార సేవలను నేరుగా గడప వద్దకే అందేవి. సచివాలయాల్లో సిబ్బందిని నియమించాల్సిన బాధ్యత మండల అధికారులదే. వారి నిర్లక్ష్యం కారణంగా చింతరాజుపల్లె వాసులు ప్రభుత్వ సేవలు అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. క్యాలెండర్లు మారుతున్న సచివాలయానికి సిబ్బందిని నియమించకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గ్రామమైన చింతరాజుపల్లిలో అసాంఘిక కార్యక్రమాలు జరిగే అవకాశం ఎక్కువశాతం ఉంటుందని ఆ గ్రామ ప్రజలు చెబుతున్నారు. ఇక్కడ గతంలో పని చేసిన మహిళా పోలీసు కూడా లేకపోవడంతో గ్రామ మహిళల భద్రతపై అధికారులకు పట్టడంలేదనే వాదన వినిపిస్తోంది. అలానే గ్రామంలో ప్రభుత్వ సర్వేలు చేయాలంటే సిబ్బంది కొరతతో ఇక్కడ పని చేస్తున్న ముగ్గురు సచివాలయ ఉద్యోగులపైన పనిభారం అధికంగా పడుతోంది. దీంతో నిర్దేశించిన సమయానికి సర్వేలను పూర్తి చేయలేకున్నారు. అలానే తమపై పని ఒత్తిడి అధికంగా పడుతుండటంతో సిబ్బంది సైతం తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. ఎంతో గొప్ప సంకల్పంతో ఏర్పాటైన సచివాలయాల స్ఫూర్తిని మండల అధికారులు మనసకబారనియ్యక సిబ్బంది నియమించి ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చింతరాజుపల్లి గ్రామ సచివాలయ భవనం

సిబ్బందిని నియమిస్తాం



ఒంటిమిట్ట మండలంలో గత తొమ్మిది సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది సిబ్బంది డిప్యుటేషన్‌పై వెళ్లడంతో సచివాలయ సేవలు పొందడంలో కాస్త జాప్యం జరుగుతోంది. అసలు సచివాలయ సిబ్బందితో వారివారి సచివాలయాల పరిధిలో చాలా పనులు చేయాల్సి ఉంది. ప్రభుత్వ సర్వేలు కూడా చాలా ఉన్నాయి. ఇవన్నీ చేయాలంటే సంబంధిత సచివాలయాల్లో సిబ్బంది చాలా అవసరం. దానికోసమైనా కారణాలు తెలుసుకొని డిప్యుటేషన్‌పై వెళ్లిన వారిని పాత స్థానాల్లోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతాం.

– సుబ్రమణ్యం, జిల్లా ఇన్‌చార్జ్, జీఎస్‌డబ్ల్యూఎస్

మండలానికి డ్రోన్ మంజూరు

రాయచోటి టౌన్ : మండలానికి ఒకటి చొప్పున సబ్సిడీతో కూడిన డ్రోన్ మంజూరు చేస్తున్నట్లు రాయచోటి డివిజన్ వ్యవసాయశాఖ అధికారి(ఏడీఏ) శ్రీలత శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఆసక్తి కలిగిన వారు ఒక గ్రూప్‌గా ఏర్పడి దీనిని పొందవచ్చున్నారు. మొత్తం ఐదు మంది రైతులు ఒక గ్రూప్‌గా ఏర్పడి బ్యాంక్ ఖాతా తెరిచి రూ.5లక్షలు అందులో జమ చేయాలని తరువాత బ్యాంక్ రూ.5 లక్షలు జమచేసి రూ.10 లక్షల విలువ చేసే డ్రోన్ (పిచికారీ చేసే) కొనుగోలు చేసుకోవచ్చాన్నారు. తరువాత ప్రభుత్వం 80శాతం సబ్సిడీ మంజూరు చేస్తుందన్నారు.

మానవత్వం చాటుకున్న వైద్యుడు

రాజంపేట : పట్టణంలో గత కొద్దిరోజులుగా తమిళనాడుకు చెందిన ఓ వృద్ధుడు మతిస్థిమితం లేక పడివున్నారు. ఆరురోజుల నుంచి అనారోగ్యంతో అల్లాడిపోతున్నాడు. ఇబ్బంది పడుతున్న విషయం రాజంపేట ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ డా.పీవీఎస్ రాజు దృష్టికి వెళ్లింది. వెంటనే తన సిబ్బందితో కలిసి వృద్ధుడిని చికిత్స నిమిత్తం ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. వైద్యం అందించడంతో ఆ వృద్ధుడు కోలుకుంటున్నారు. పలువురు హాస్పిటల్ సూపరింటెండెంట్‌ను అభినందిస్తున్నారు.

అక్రమంగా మట్టి తరలింపు



జేసీబీ సాయంతో ట్రాక్టర్‌కు మట్టిని తోడుతున్న దృశ్యం

రాయచోటి : సంబేపల్లె మండలం యర్రకొండ సమీపంలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారని స్థానికులు శుక్రవారం తహసీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డికి ఫిర్యాదు చేశారు. పీఎస్.కాలనీ, నగిరికి చెందిన తమ దాయాదుల పట్టా భూమిలో అధికార పార్టీ నాయకుల అండతో ఓ వర్గీయులు, జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో తరలిస్తున్నారని మరో వర్గీయులు వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దారు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు.

పని ఒత్తిడికి తోడు అధికారులు బెదిరిస్తున్నారు

కలెక్టర్ గోడు వెల్లబోసుకున్న ఏఎన్ఎంలు



జిల్లా కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీలు

రాయచోటి జగదాంబసెంటర్ : గ్రామ, వార్డు సచివాలయాలలో హెల్త్ సెక్రటరీలుగా పనిచేస్తున్న తమకు పని ఒత్తిడి ఉందని.. దానికితోడు మండల, మున్సిపల్ అధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి ఉందంటూ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి ఏఎన్ఎంలు విన్నవించారు. శుక్రవారం రాయచోటిలోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌కు ఏఎన్ఎంలు కలిసి ఈ మేరకు అధికారులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు రకాల సర్వేలు రోజువారీగా ఫీల్డ్ లెవెల్‌లో ఎప్పటికప్పుడు చేస్తూ రిపోర్టులన్నీ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లో ఉన్నతాధికారులకు పంపిస్తున్నామన్నారు. అలాగే గ్రామంలో ప్రతి ఒక గర్భవతి, బాలింతలను గృహ సందర్శనలు చేస్తున్నామని ప్రతి నెలలో ఆశా మీటింగ్‌లు, సెక్టార్ మీటింగ్‌లకు హాజరవుతున్నామన్నారు. మాకు డీఎంహెచ్‌ఓ ఆదేశాల నుంచి వచ్చిన జీవోల ప్రకారం మేము మాకు కేటాయించిన పనులు చేస్తున్నామన్నారు. అయినప్పటికీ మండల, మున్సిపల్ అధికారులు సచివాలయ పరిధిలోని సర్వేలు అన్నీ తామే చేయాలని మాపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. అలాగే ఆ సర్వేలు చేయకుంటే జీతాలు నిలిపివేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. దీని వలన మాపై పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. ఈ విషయమై చొరవ తీసుకొని న్యాయం చేయాలని ఏఎన్ఎంలు కలెక్టర్‌ను కోరారు.

గణతంత్ర వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటం ఉంచాలి

రాయచోటి అర్బన్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటాన్ని ఉంచాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బోధిషావలీ, రాజశేఖర్‌లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు విన్నవించారు. శుక్రవారం వారు కలెక్టరేట్‌లో ఆయన్ను కలుసుకుని మాట్లాడారు. ప్రతియేటా నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలు అంబేడ్కర్ చిత్రపటంతో నిర్వహించాల్సి ఉండగా జిల్లా పరిధిలో ఈ నియమాన్ని తుంగలో తొక్కుతూ రాజ్యాంగ నిర్మాతను అవమానిస్తున్నారన్నారు. కుల వివక్షతో పలు పర్యాయాలు అంబేడ్కర్ చిత్రపటం లేకుండా గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించిన సందర్భాలున్నాయని చెప్పారు. ఈనెల 26న జిల్లాలో నిర్వహించే గణతంత్ర దినోత్సవాల్లో ప్రతి పాఠశాల, కళాశాల, కార్యాలయాల్లో తప్పనిసరిగా అంబేడ్కర్ చిత్రపటంతో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలంటూ వారు కలెక్టర్‌కు విన్నవించారు. ఆ మేరకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు.

మాజీ జడ్జి రామకృష్ణపై కేసు నమోదు చేయాలి

ఓబులవారిపల్లె : రాష్ట్రంలో రెడ్ బుక్ పాలనకు అంతే లేకుండా పోతోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వత్తలూరు సాయి కిషోర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఆయన కొర్లకుంటలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ జడ్జి రామకృష్ణ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డిని చంపుతామని చేసిన వ్యాఖ్యలు రెడ్ బుక్ పాలనకు నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగడమేకాక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారంటూ తెలిపారు. ఓ చానల్ వేదికగా (సాక్షి కాదు) జరిగిన చర్చ కార్యక్రమంలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డిని చంపేస్తామని చెప్పడాన్ని తప్పుబట్టారు.

ఇలాంటి వ్యాఖ్యలు చేసిన మాజీ జడ్జి రామకృష్ణపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని క్రిమినల్ కేసు నమోదు చేయడమే కాక పెద్దిరెడ్డికి భద్రతను పెంచాలని డిమాండ్ చేశారు. పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి ఒక వ్యక్తి కాదని, శక్తి అని ఆయన పేర్కొన్నారు. ఆయన కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలియజేశారు.

రోడ్డు నిర్మాణ పనులు అడ్డగింత



రోడ్డు పనులను అడ్డుకుంటున్న ప్రజలు

నందలూరు : నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఇసుకపల్లికి వెళ్లే రోడ్డు వేయడానికి శుక్రవారం పనులు ప్రారంభించడంతో ఆ రోడ్డుకు అనుసంధానంగా ఉండే మధురాచారి వీధి ప్రజలు మాజీ వార్డు మెంబర్ తోట శివశంకర్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ రోడ్డువేస్తే మా రోడ్డుతో కలిపి వేయండి లేదా వేయవద్దని డిమాండ్ చేశారు. గత 20 సంవత్సరాల నుంచి వర్షం పడితే రోడ్డుపై నీళ్లు నిలబడుతున్నాయని, ఎన్నిసార్లు పంచాయతీ వారికి మొరపెట్టుకున్నా రోడ్డు వేయలేదని, ఇప్పుడు ఈ రోడ్డు వేస్తే మా ఇళ్లలోకి నీరు వచ్చి ఇబ్బందులు పడుతామని ఆవేదన వ్యక్తం చేశారు. మా సమస్యకి పరిష్కారం చూపి తరువాత రోడ్డు వేయాలని పట్టుబట్టారు. అనంతరం కాంట్రాక్టర్‌తో మాజీ వార్డు సభ్యుడు తోట శివశంకర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను అడ్డుకోవడం మా ఉద్దేశం కాదని, తమ సమస్యకు పరిష్కారం దొరకాలని, తాత్కాలిక పరిష్కారంగా మధ్యలో రోడ్డు కొంతభాగం వేయకుండా తరువాత వేయాలని సూచించి పనులను ప్రారంభించారు.

భద్రకాళికి రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళీ అమ్మవారు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అమ్మవారిని అలంకరించారు. అలాగే భక్తులు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. అనంతరం అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు రాహుకాల పూజల విశిష్టతను దాని ఫలితాలను వివరించి చెప్పారు. పూజా కార్యక్రమాలు ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగాయి.

రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు మెరుగుపరచండి



అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : కోడూరు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం వసతులు మెరుగుపరచాలని శుక్రవారం డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్, మండల నాగేంద్రలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడారు. రైల్వేస్టేషన్ అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు ఉన్నతాధికారులకు పంపాలని కోరారు. స్టేషన్‌లో కనీస మౌలిక వసతులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఫరూక్, గల్లా శ్రీనివాసులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



యానాదిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బుసిరెడ్డి యానాదిరెడ్డి మృతి విషయం తెలుసుకొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు శుక్రవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సర్పంచ్‌లు హరికృష్ణారెడ్డి, రామకృష్ణలు పాల్గొన్నారు.

నూతన నియామకం

రాజంపేట రూరల్ : ఏపీఎస్‌పీడీసీఎల్ డివిజన్ బోర్డు స్టాండింగ్ కౌన్సిల్‌గా ప్రభుత్వం తనను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు హస్తవరం సుదర్శన్‌రెడ్డి తెలియజేశారు. మండల పరిధిలోని హస్తవరం గ్రామానికి చెందిన తాను గత 20 సంవత్సరాల నుంచి పలు కోర్టుల పరిధిలో న్యాయవాదిగా సేవలు అందిస్తున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలియజేశారు. నేటి నుంచి ఏపీఎస్‌పీడీసీఎల్ తరపున ఉన్న కేసులను సత్వరమే వాదించి ప్రభుత్వం తమపై పెట్టిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని ఆయన పేర్కొన్నారు.

అన్నమయ్య మంచినీటి స్కీం పైపు లీకేజీ

నేడు, రేపు నీటి సరఫరా నిలిపివేత



పాత ఎంవీఐ కార్యాలయం వద్ద లీకేజీ అయిన అన్నమయ్య మంచినీటి పథకం పైపులైను

రాజంపేట : పట్టణానికి మంచి నీటి సరఫరా చేసే అన్నమయ్య మంచినీటి పథకం పైపులు శుక్రవారం లీకేజీ అయ్యాయి. దీంతో శనివారం, ఆదివారం రోజున పలు ప్రాంతాలలో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు రాజంపేట పురపాలక సంఘం ప్రకటించింది. ఇందుకు ప్రజలు సహకరించాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. బాలిరెడ్డిపల్లె, పాత ఎంవీఐ కార్యాలయం వద్ద పైపులైను లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. మరమ్మతు పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

సరఫరా ఉండని ప్రాంతాలివే..

పట్టణంలో ఉస్మానగర్, కొలిమివీధి, ఆర్‌అండ్‌బీ బంగ్లా, ఎగువగడ్డ, లక్ష్మీనగర్, మన్నూరు, నలంద కాలేజి ఏరియా, సాయినగర్, మన్నూరు దళితవాడ, గంగిరెడ్డిపాలెం, సరస్వతీపురం, ఆర్ఎస్‌రోడ్డు, మహబూబ్‌నగర్‌లో నీటి సరఫరా రెండురోజులు పాటు ఉండదు. రాజీవ్‌గనర్, సుద్దగుంతలు, నూనివారిపల్లెరోడ్డు, రామ్‌నగర్, బాలాజీనగర్, ఆకుల వీధి, కనకమ్మసందు, గడ్డివీధి, భవానీనగర్, ముకందరగడ్డ, బంద్రాళ్లవీధి, నూనివారిపల్లె, హైదర్‌నగర్, అమ్మవారిశాలవీధి, ఈడిగపాళెం, ఎర్రబల్లి, విద్యుత్ నగర్, బలిజపల్లె, హరిజనవాడలకు నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు పురపాలకసంఘం తెలిపింది.

ప్రజల నడ్డి విరిచేందుకే స్మార్ట్ మీటర్లు



స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ, నాయకులు

వీరబల్లి : స్మార్ట్ మీటర్లు బిగించి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోందని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, గాలివీటి వీరనాగిరెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం వారు ఇంటింటా స్మార్ట్ మీటర్లను బిగిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. వాటి పనితీరుపై వాకబు చేశారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు అధికారంలోకి రాగానే వేల కోట్ల రూపాయలను ప్రజలపై భారం వేసి చోద్యం చూస్తోందన్నారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్లను బిగించి ముందుగానే రీచార్జ్ చేసుకునే పద్ధతిని తీసుకొస్తోందని చెప్పారు. ఈ నిర్ణయం పేదలు, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్రజాప్రయోజనాలను పక్కకు బెట్టి కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే విద్యుత్ రీచార్జ్ చేసుకునే ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలి

రైల్వేకోడూరు అర్బన్ : రాజంపేట డివిజన్ పరిధిలో ప్రతి ఒక్కరూ నిబంధనలు ప్రకారం వాహనాలు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని రాజంపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ శుక్రవారం పేర్కొన్నారు. స్థానిక సాయి డిగ్రీ కళాశాలలో యువతీయువకులకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి డ్రైవింగ్ లైసెన్స్ విధిగా తీసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించినప్పుడు మనమందరం సురక్షితంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సీఐ హేమసుందర్ రావు, ఎస్ఐ నవీన్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ భూములను రక్షించండి

పుల్లంపేట : పుల్లంపేటలోని సర్వే నెంబరు. 288లో 3.2 ఎకరాల భూమి గంగమ్మ దేవాలయం మాన్యం భూమి ఉంది. సదరు భూమిని సీతారాంపేటకు చెందిన వారు ఆక్రమించారని శుక్రవారం జిల్లా ఎండోమెంట్ అధికారి విశ్వనాథ్ ఉన్నతాధికారుల ఆదేశాల నిమిత్తం విచారణ చేపట్టారు. గంగమ్మ దేవాలయ సభ్యులతో వారు సమావేశం నిర్వహించారు. ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూకల శ్రీరాములు, బోగా పార్థసారథి, సురేష్, సోము బాలాజీ, చెంగయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను బ్రతకనిద్దాం

ఆడపిల్లలను బ్రతకనించడమే కాక రక్షించుకుందామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అన్ని మండల కేంద్రాల్లో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలపై వివక్ష నెలకొందని, ఆడపిల్లల భ్రూణ హత్యల సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. ఆడపిల్లలు లేకుంటే భవిష్యత్తు ఉండదన్నారు. అనంతరం అన్ని మండల కేంద్రాల్లో ఆడపిల్లలను బ్రతనిద్దాం.. భవిష్యత్తును కాపాడుకుందాం అంటూ నినాదిస్తూ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. – సాక్షి, నెట్‌వర్క్



ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో..



రైల్వేకోడూరు అర్బన్: మాట్లాడుతున్న సీడీపీఓ



సిద్దవటం: ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



రామాపురం: అవగాహన కల్పిస్తున్న డీసీపీఓ



పుల్లంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, విద్యార్థులు, టీచర్లు



లక్కిరెడ్డిపల్లె: సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు



రాజంపేట రూరల్: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సానే శేఖర్



పెనగలూరు: హాజరైన బాలికలు